అందుకని జానకమ్మగారు "యేంరా, రాము, వెడతావా? ఈ నెల రోజులూ వుంటావా?" అనడిగింది. ఏంచెప్పాలో రాముకు అర్థంగాలేదు కొంత సేపటిదాకా.

పరీక్ష తప్పిపోవటాన్ని గురించి గోపాలం, ఒకసారి రాముకు చిన్న లెక్చరిచ్చాడు: "పరీక్ష అంత దుర్భాగ్యమైనవి ఇంకేమీలేవు. చూడు, చదివిన లక్ష విషయాల్లో యే పదో అడుగుతారు. సరిగ్గా ఆ పదే వదిలి చదివినవాడు యెందుకూ పనికిరాడు కదా! పరీక్ష తప్పటంకన్నా మరో అవమానం లేదు. ఆ అవమానంతో కార్ల కిందా, రైళ్ళకిందాపడి ఆత్మహత్య చేసుకొన్నవాళ్ళూ వున్నారు, నదుల్లో దూకి చచ్చినవాళ్ళూ వున్నారు. కాని చచ్చి యేం లాభం?..."

రాము వెడతానన్నాడు. "ఏం?" అనడిగింది జానమ్మగారు. సకారణంగా చెప్పాడు. పైగా యింకో నెలేగదా వున్నది బడి తెరిచేందుకు. అదీగాక, అమ్మను విడిచి నెలపై పదిహేనురోజు లయింది.

రాము వెడుతూ వెడుతూ గోపాలాన్ని కూడా రమ్మన్నాడు. "ఎట్లాగూ వాడిని దింపి రావటాని కొకళ్లు వెళ్లాలిగా! వెళ్లు తోడుగా" అన్నది గోపాలాన్ని తల్లి. గోపాలం తమ్ముడి కోరికనూ, తల్లి ఆజ్ఞనూ నిరాకరించలేదు.

తమ్ముడితో వెళ్లిన గోపాలాన్ని చక్కగా ఆదరించారు రాము యింట్లో. రాము తన స్నేహితులందర్నీ పరిచయం చేశాడు. నాలుగు రోజులయాక గోపాలం తన దారిన తను వెళ్లిపోయాడు.

రాము మళ్ళీ మామూలు మనిషయాడు. తను ఆవూళ్ళో- పెద్దమ్మగారి వూళ్ళో చూచిన మనోహర దృశ్యాలూ, గోపాలం ద్వారా విన్న కథలూ, మాటలూ నెమరుకు తెచ్చుకొంటూ మిగతా సెలవుల్ని గడిపాడు.

రోజులెంత సేపట్లో గడుస్తై? మళ్ళీ బడులు తెరిచారు. తను సెలవులు రెండు నెల్లూ ఎలా సార్థకం చేసుకున్నదీ తల్చుకుంటూ రాము బడికి బయల్దేరాడు, తన స్నేహితులందర్నీ కలుసుకోటానికి.

---

కథానిక

# బంధువులు

సరిపల్లి ద్వారకనాథ్

ఎలాగయితేనేం శాంతని పుట్టింటికి పంపటానికి చివరకు ఒప్పుకొన్నాను. మా అత్తగారి (శాంత తల్లి) ఆరోగ్యస్థితి మళ్ళీ గత నాలుగు రోజులనుంచీ విషమించిందనీ, ఆవిడగారు నన్నూ శాంతనీ చూడాలని చాల ఆత్రుతతో ఉన్నదనీ, ఉత్తరం అందిన వెంటనే మా యిద్దర్నీ బయలుదేరి రమ్మనీ, మామయ్య వ్రాసిన ఉత్తరం నిన్ననే అందింది. ఈ ఆఫీసు గొడవల్లో అసలు ఊపిరి తీసుకోటానికే నాకు టైము లేకపోతోంది. నేను వెళ్లటము ఎల్లాగూ వల్లకాదు. అందులోనూ నేను సరిగ్గా పని చేయటంలేదని ఆఫీసరు పై అధికారులకు నా మీద రిమార్కు వ్రాశాడు. ఈ పరిస్థితుల్లో సెలవు పెట్టేనంటే చాల ప్రమాదం.

పోనీ శాంతను ఒక్కర్తెనే పంపిద్దామంటే, పదిహేను, ఇరవై రోజుల వరకూ పుట్టింటిలోనే ఉంటాననంటోంది. అన్నాళ్లూ నేను అయ్యరు హోటల్లో కప్ మీల్సు తీసుకుని ప్రాణం నిలబెట్టుకోవాలి. భోజనం విషయంలో నేను బకాసురుడికి రమారమి తమ్ముణ్ణి అవుతాను. అటువంటప్పుడు ఉడికీ ఉడకని మెతుకులను రాళ్ళతో మిశ్రమంచేసి, రేషన్ పద్ధతి ప్రకారం అయ్యరు నాకు వడ్డిస్తే యెలాగు జీవించగలనూ అంట? భోజనం దగ్గర శాంత మాటిమాటికీ తన తీయని కబుర్లతో నన్ను గిలిగింతలు పెట్టకపోతే నాకు అసలు ముద్ద గొంతుక దిగదు. ముఖ్యంగా, శాంత లేకపోతే యింట్లో నేనొక్క క్షణం ఉండగలనా అసలు? అందుచేత శాంతని పుట్టింటికి పంపటానికి మొదట్లో నేను అంగీకరించని మాట వాస్తవమే.

“ఇంతలోకి మీ అమ్మకు వచ్చే ప్రమాదం ఏమీ లేదులే. నాకు సెలవు దొరికితే మన మిద్దరం యింకొకసారి వెళ్ళవచ్చు” అన్నాను శాంతతో మామూలు ధోరణిలో.

ఈ మాటతో శాంత సంతోషం పూర్తిగా చచ్చింది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగేయ్. “మీకు యిక రెండు నెలలకు గాని సెలవు దొరకదు. పోనీ నన్నైనా పంపండి? అందులోనూ అమ్మకు జబ్బు తీవ్రంగా ఉందిట. మా వాళ్ళని చూసి అప్పుడే ఎనిమిది నెలలు అవవస్తున్నాయి” అంది శాంత చాల దీనంగా. నేను ఆమె కళ్ళలో నీళ్ళు చూడలేకపోయాను. శాంత కూడా నన్ను విడిచి ఒక్క క్షణం ఉండలేదు. అయితే, పుట్టింటివారిమీద ఉండే ప్రేమ, అభిమానము, స్త్రీమీద యెంత గాఢంగా పని చేస్తాయంటే, ఆవిడ ఒక్కొక్కప్పుడు అవసరం వస్తే, భర్త ఆజ్ఞను కూడా తృణీకరించి పుట్టింటికి వెళ్ళటానికి వెనుదీయదు. లేకపోతే, ఆమెకు తప్పకుండా అవమానము జరిగి తీరుతుందని శంకరుడు దక్ష యజ్ఞానికి పార్వతిని వెళ్ళవద్దని వారిస్తే, ఆమె విన్నదా? పాపం! తల్లిదండ్రులను, బంధువులను చూడాలని శాంత మనస్సు యెంతగా ఆరాటపడుతోందో! ఒకవేళ ఆవిడని పంపించకపోతే మూతి ముడుచుకొని నామీద రుసరుసలాడుతూ కూర్చుంటుంది. ఏ రట్టూ రవ్వా లేకుండా సాగిపోతున్న మా సంసారంలో అంతః కలహాలను రెచ్చగొట్టడం నా కిష్టం లేదు. ఇంతకూ ఆమె కోరింది ఒకసారి తల్లిదండ్రులను చూడటానికి అనుజ్ఞ యిమ్మనేగా! అందుచేత శాంతని పుట్టింటూరి ఊరు ఏలూరుకు పంపటానికి ఒప్పుకున్నాను. నేను యీ ఇరవై రోజులు ఏదో విధంగా వెళ్ళబుచ్చలేక పోతానా?

ఇక శాంత ఆనందానికి మేరలేకపోయింది. మర్నాడు ఉదయం బండిలో శాంతను ఏలూరికి పంపేను. తరవాత అయ్యారు హోటల్లో రెండు మెతుకులు తిని, ఆఫీసుకి వెళ్ళేను. ఆ రోజు శనివారం కావటంచేత రెండు గంటలకే ఇంటికి తిరిగి వచ్చేను. వసారాలో ఈజీ ఛేర్‌లో కూలబడి సిగరెట్ కాలుస్తూ పత్రిక చదువుతున్నాను. ఇంతలో తలుపు ఎవరో తట్టినట్టు వినిపించింది. నేను కుర్చీలోంచి లేచి వెళ్ళి, వీధి తలుపు కొంచెం ఓరగాతీసి బయటకు తొంగిచూసేను. ఎవరో ఒక పురుషుడు-సుమారు నలభైఅయిదేళ్ళు వయస్సు ఉండవచ్చు-ఒక పునిస్త్రీ ఆవిడ, ఒక వితంతువు బయట నిల్చున్నారు.

“బులుసు ప్రకాశరావుగారి యిల్లెక్కడండీ?” అని నన్ను ఆ మనిషి అడిగేడు.

“నేనే నండి ఆ ప్రకాశరావుని. మీ రెవరు?” అని తెల్లపోతూ అడిగేను. ముక్కూ మొహం తెలియని ఈయనకు నాతో ఏం పని వచ్చిందో! ఆయన నావైపు ఆశ్చర్యంగా క్షణమాత్రం చూసి, “ఒరే నాయనా! గుర్తుపట్టడానికి వీలులేకుండా మారి పోయావురా! శాంత పెళ్ళికి మేము వచ్చినప్పుడు ఎంత బలంగా పుష్టిగా కనబడ్డావు. ఇదేమి టిలా తయారయావే ఆఖరికి? ఒంట్లో కులాసాగా లేదా!” తరువాత అతడు తనతో వచ్చిన స్త్రీలవైపు తిరిగి “దేముడి దయవల్ల మనం సరాసరి ప్రకాశ్ దగ్గరకే వచ్చాము. నాలుగు వీధులు తిరగవలసిన పని తప్పింది” అంటూ వీధి తలుపు త్రోసుకొంటూ యింట్లోకి చొరబడ్డాడు. ఆయన వెనకాలే మిగిలిన యిద్దరు స్త్రీలు యింట్లోకి ప్రవేశించారు.

నాకు నిజంగా మూర్ఛపర్యంతం అయింది. ఇంతకుపూర్వం ఈ జన్మంలో కాదుకదా, పది పూర్వపు జన్మలోనైనా ఈ పెద్దమనిషిని నేను చూసినట్టు జ్ఞాపకము లేదు. నేను విస్తుపోయి ఏమి చేయటానికి తోచకుండా అలాగే నిలబడి చూస్తూంటే, ఆ పెద్దమనిషి సామాను వసారాలో పెట్టి, కండువాతో మొఖము తుడుచుకొంటూ “ఏమోయ్ ప్రకాశ్! మా శాంతమ్మ ఏదీ?” అని నన్ను తిరిగి ప్రశ్నించాడు. అమ్మయ్య! అప్పుడనుకున్నా నేను యీయన శాంతకు ఎవరో బంధువు కావాలనని! నేను మా అత్తగారికి జబ్బుగా ఉన్న విషయం, శాంతను ఏలూరుకు పంపిన సంగతీ ఆయనవస్తే చెప్పాను. తాము ఇంత శ్రమపడి బందరుతో శాంత లేకపోవడానికి ఆయన విచారించారు. ఆయన శాంతకు ఏమౌతాడో సరాసరి అడిగేద్దామనుకొన్నాను. కాని అది నా తెలివి

తక్కువను సూచిస్తుందని ఊరుకొన్నాను. ఆయన మాటల ధోరణినిబట్టి ఆయన శాంతకు పెదతండ్రి అవుతాడనీ, మదరాసులో ఉంటున్నాడనీ తెలిసింది. శాంతకూడా యింతకు ముందు నాతో అనేకసార్లు మదరాసు వెళ్ళి వాళ్ళ పెదనాన్నని, పెదతల్లిని చూడాలని చెప్పింది. మా వివాహమైన మూడేండ్లనుంచీ బందరులోనే ఉంటున్నాము. మా పెళ్ళికి శాంత పెదనాన్నగారు వచ్చారో లేదో నాకు తెలీదు. ఆయన మాటల్నిబట్టి చూస్తే వచ్చినట్టే ఉంది. కాని నేను ఆయన్ని ప్రత్యేకంగా చూడలేను. అందుచేత నేను శాంత పెదనాన్నగారిని గుర్తించలేకపోయాను.

శాంత పెదనాన్నగారు విశాఖపట్నం వెడుతూ, మా యిద్దర్నీ చూడాలని ప్రత్యేకంగా బందరు వచ్చారు. తీరా ఆయన కుటుంబం వస్తే శాంత యింట్లో లేదు. శాంత వచ్చేవరకు బందరులోనే ఉండమని వారిని మర్యాద సూచకంగా అడిగాను. శాంత పెదనాన్నగారు నామాట కాదనలేకపోయారు. వాళ్లు ఉన్న నాలుగురోజులూ నాకు అయ్యారు మెతుకులపై ఆధారపడ నవసరంలేదు.

శాంత పెదతల్లి ప్రొద్దున్నే వేడి నీళ్ళు, టిఫిను, కాఫీ అందరకూ రెడీగా ఉంచేది. పది గంటలకల్లా భోజనంచేసి ఆఫీసుకు వెళ్ళి, మళ్ళీ సాయంకాలం ఐదు గంటలకు యింటికి వచ్చేవాణ్ణి. కాఫీ, టిఫినూ అయాక నేనూ, శాంత పెదనాన్నగారు క్లబ్బుకు వెళ్ళేవాళ్ళం. రాత్రి మళ్ళా యింటికి వస్తే, ఆ వితంతువు మాకు భోజనం పెట్టేది. ఆవిడ శాంత పినతండ్రి భార్య. భర్తపోయిన ఆవిడ శాంత పెదనాన్న గారింట్లోనే ఉంటోందిట.

మర్నాడు ఫస్టు తారీఖు గనక నా జీతం నూటయాభై రూపాయలు చేతికందేయి. విశాఖపట్నం వెళ్ళేక డబ్బు పంపిస్తాననీ, బందరులో బట్టలు కొనుక్కోవాలనీ, శాంత పెదనాన్నగారు 50 రూపాయలు తీసుకున్నారు. తరువాత నాల్గురోజులు మాఊళ్ళోఉన్న నాలుగు సినిమాథియేటర్లకి వాళ్ళనితీసుకువెళ్ళాను. నేను డబ్బు దుబారాగా ఖర్చు చేస్తున్నానని శాంత పెదనాన్నగారు నన్ను కోపగించారు. ఇంటికి వచ్చిన అతిథుల్ని సంతోషపెట్టాలని నా ఆశయం. తాను నాకేమీ క్రొత్తవారుకారనీ, బంధువుల విషయంలో డబ్బు ఖర్చు పెట్టవలసిన పనిలేదని శాంత పెదనాన్నగారు నాకు సలహా ఇచ్చేరు. మొత్తంమీద శాంత పెదనాన్నగారి కుటుంబంతో నాకు ఆ పదిహేనురోజులు సుఖంగా గడిచేయి.

ఒకరోజు శాంత పెదనాన్నగారు విశాఖపట్నం వెళ్ళిపోవాలన్నారు. ఆయనకు అక్కడ చాల జరూరైనపని కలిగిందట. ఇక శాంత నాలుగురోజుల్లోవచ్చేస్తుందనీ,ఎలాగు పదిహేను రోజులు ఉన్నారు కొబట్టి ఆనాలుగు రోజులు ఉండమని ఆయన్ని ప్రార్థించేను. శాంత పెదనాన్నగారు బలవంతం చెయ్యవద్దన్నారు.

“అబ్బాయ్! విశాఖపట్నం వెళ్తూ, ఏలూరులో ఒకపూట ఆగి శాంతను, మా తమ్ముణ్ణి చూసి వెళ్తాను. నీవద్ద ఎన్నాళ్ళైనా ఉండిపోవాలనిపిస్తోంది. కాని నాకు విశాఖపట్నంలో అర్జంటు పని ఉంది” అన్నారు శాంత పెదనాన్నగారు.

ఆ రోజే పదిగంటల బండిలో వాళ్ళంతా ఏలూరు వెళ్ళిపోయేరు. టిక్కెట్లు నేను కొంటూంటే శాంత పెదనాన్నగారు అనవసరంగా డబ్బు పెట్టవద్దన్నారు. కాని నేను వినిపించుకోలేదు.

శాంత పెదనాన్నగారు కుటుంబం వెళ్ళిపోయిన నాలుగురోజులూ నేను అయ్యారు దగ్గరకి వెళ్ళవలసి వచ్చింది. నాకు హోటల్లో మెతుకులు గొంతుక దిగలేదు. పాపం! శాంత పెదతల్లి ఉన్న పదిహేను రోజులు పిండివంటలతో భోజనం పెట్టి నన్ను కన్నకొడుకులా చూసుకొంది.అయ్యారుకు ఆటువంటి ఆప్యాయం నా మీద ఎందుకు ఉంటుంది, నా డబ్బుమీద తప్ప!

నాల్గురోజులు పోయేక నా ఆనంద జ్యోతి శాంత వచ్చింది. కాఫీత్రాగుతూ నేను శాంతని వాళ్ళ పెద్దనాన్న కుటుంబం ఏలూరులో కలిసిందా? అని అడిగేను. ఆవిడ ఒక్క నిముషం ఏమీ అర్థంకానట్లు చూసి, “మా పెద్దనాన్న గారు యింకా మద్రాసులోనే ఉన్నారుగా! నిన్ననే ఆయన వద్దనుంచి ఉత్తరం

వచ్చింది. రెండు రోజులలో ఆయన కుటుంబంతో ఏలూరు వస్తారనీ, ఏలూరు వెళ్ళేటప్పుడు బందరు కూడా వచ్చి మనల్ని ఇద్దర్నీ చూస్తామని మా నాన్నగారికి ఉత్తరం వ్రాశారు. నేను ఏలూరులో ఉన్న సంగతి ఆయనకు తెలీదు. ఎప్పుడో పెళ్లిలో మిమ్మల్ని ఒక్కసారి చూసేరుట, అందుకని యిక్కడకు తప్పకుండా వస్తారు. ఆయనెంత మంచివారనుకున్నారు? మన ఇంట్లో ఆయన ఫోటో కూడా లేదు. ఆయన మొఖం చూస్తేనే తెలుస్తుంది యెంత మంచివారో?" అని శాంత ఒక్కగుక్కలో చెప్పింది.

నాకు యిదంతా చాలా అయోమయంగా ఉంది. నాలుగు రోజుల క్రితమేగా శాంత పెదనాన్నగారు కుటుంబంతో సహా యిక్కణ్ణుంచి ఏలూరు వెళ్లేరు! పోనీ శాంతకు ఇద్దరు పెదనాన్నలు ఉన్నారా అంటే లేరు. అయితే శాంత పెదనాన్ననంటూ మా యింటికి వచ్చిన యీ డూప్లికేట్ పెదనాన్న ఎవరు? నేను శాంతతో వాళ్ల పెదనాన్న యిక్కడకు వచ్చినది మొదలు, వెళ్ళినవరకు జరిగిన సంగతి సందర్భాలన్నీ వివరంగా శాంతకు చెప్పేను.

"అదేమిటండీ! మా పెదనాన్నగారు యింకా మద్రాసులోనే ఉంటిరిగా! ఈ పెదనాన్న ఎవరో నాకు తెలియదు" అంది ఆశ్చర్యంగా.

నామీద పిడుగు పడినట్లయింది. శాంత పెదనాన్ననంటూ వచ్చిన పెద్దమనిషిని, ఆయన భార్యను, ఆ వితంతు స్త్రీని నాకు జ్ఞాపకమున్నంతవరకూ ఎలాగ ఉంటారో శాంతకు విశదంగా వర్ణించి చెప్పేను. అసలు యింకా ఆశ్చర్యకరమైన విషయమేమంటే శాంత పెదనాన్న నంటూ వచ్చిన ఆ మనిషికి, నేను ఇంతవరకు శాంత అసలు పెదనాన్నగారిని చూడలేదన్న విషయం ఎలా తెలిసింది? శాంత ఏలూరు వెళ్ళిందని ఎలాగు కనిపెట్టేరు వాళ్లు? వాళ్లు ఎంత ధైర్యంగా నా యింట్లో (శాంత పెదనాన్నగారి కుటుంబం అని మోసపుచ్చి) పదిహేను రోజులున్నారు? శాంత వస్తుందన్న భయంచేతనే కాబోలు, యెందుకేనా మంచిదని నాలుగు రోజులు ముందుగానే వెళ్ళిపోయేరు! వెధవలు! నా డబ్బంతా తెగతిన్నారు.

ఇవన్నీ విన్నాక శాంత కొంచెం జ్ఞాపకం చేసుకున్నట్టు అభినయించి, చివరకు ఇలా అంది. "మన యింటికి వచ్చినవాళ్లు, యింకా కొందరు స్త్రీలు బెజవాడ స్టేషనులో కనపడ్డారు. మా రైలు రావటానికి యింకా అరగంట టైము ఉండటంచేత ఆ స్త్రీలతో కబుర్లు చెప్పుకుంటూ కూచున్నాను. చూడండి, ఇద్దరు ఆడవాళ్లు మాట్లాడుకొంటే, గృహ విషయాలన్నీ అందులో దొర్లుకుపోతాయి. వాళ్లు మద్రాసులో తంబుచెట్టి వీధిలో ఉన్నామని చెప్తే, ఆ వీధిలోనే ఉన్న మా పెదనాన్నగారిని యెరుగుదురేమోనని వాళ్లని అడిగేను. ఆ వింతతు మనిషి, మీరు చెప్పిన గుర్తులుబట్టి చూస్తే, నాకు బెజవాడలో కనిపించిన వితంతువే. ఆయన్ని వారు యెరుగుదురట. తరువాత మీ పెదనాన్నగారి చరిత్ర అంతా వాళ్ళకు చెప్పేను. అయినా వాళ్ళకి మా పెదనాన్నగారు తెలీదన్నారు. అప్పుడు ఆ వితంతు స్త్రీ నన్ను అడిగింది "మీ దంపతు లిద్దరు ఎప్పుడేనా మద్రాసు వచ్చేరా?" అని. ఇంతవరకు వెళ్లలేదని, ఒక్కసారి వీలుచూసుకొని మద్రాసు మన మిద్దరము వెళ్తామని జవాబిచ్చేను. అమ్మకు జబ్బుగా ఉంటే ఏలూరు వెళ్తున్నాననీ ఇంకా ఇరవై రోజులకుగాని బందరు తిరిగిరానని ఆవిడతో నేను అన్నాను. తరువాత బందరులో మనము ఎక్కడ ఉంటున్నదీ, మా పేరు యెడ్రెసు ఆవిడ అడిగితే నేను చెప్పేను."

శాంత ఒక్క నిముషం ఆగి మళ్ళీ చెప్పింది. "ఆ సందర్భంలోనే ఒకసారి మీరు మద్రాసు వెళ్ళేరనీ, మా పెదనాన్నను యింతవరకు చూడని కారణంచేత హోటల్లోనే ఉన్నారనీ చెప్పేను. నేను ఏలూరు వెళ్ళి 20 రోజులవరకు రానని తెలిసి, ఇంటిదగ్గర మీరొక్కరే వున్నారని కనిపెట్టి, వాళ్లు ఇక్కడికి వచ్చివుంటారు."

అప్పటికి నేను గ్రహించగలిగాను. కొందరు స్త్రీలు, పురుషులు జట్టుగా కలిసి, అందరి గృహ విషయాలు కనుక్కుంటూ, వీలు చూసుకొని బంధువుల్లా తయారయి నెత్తిమీద కూర్చుంటున్నారు కాబోలు!